తెలంగాణ
ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ సంపుటి : 01 సంచిక : 01 శుక్రవారం 07 - 08 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజిలు : 1




**ప్రజావారధి/ఆత్మకూరు(ఎం)**

తెలంగాణ రాష్ట్రంలో నూనె గింజల దిగుమతులు తగ్గించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్ ఫాం సాగును ప్రోత్సహిస్తున్నాయి. ఆయిల్ ఫాం పంట అనేది ఒక శాశ్వత (సుమారు 30 సం.ల వరకు) అధిక దిగుబడి (సుమారు 1.30 లక్షల ఆదాయం/ఎకరా) ఇచ్చే వాణిజ్య పంట. సరైన నీటి వనరులు, అనుకూల నేలలు కలిగి వుండి సరైన ప్రణాళిక, శాస్త్రీయ సాగు విధానాలు పాటిస్తే రైతులకు దీర్ఘకాలికంగా స్థిర ఆదాయం లభిస్తుంది.

## ఆయిల్ పామ్ సాగు ప్రాధాన్యత

భారతదేశంలో వాడే వంట నూనెల్లో సుమారు 60 శాతం దిగుమతులపై ఆధారపడుతున్నాం. ఈ పరిస్థితి మారాలంటే దేశీయంగా ఆయిల్ ఫాం సాగు విస్తీర్ణం పెరగాల్సిన అవసరం ఉంది. ఇతర నూనె పంటలతో పోల్చితే ఆయిల్ ఫాం పంట ద్వారా ఒక ఎకరానికి నాలుగైదు రెట్లు ఎక్కువ నూనె ఉత్పత్తి సాధ్యమవుతుంది.

## ప్రభుత్వ ప్రోత్సాహకాలు

నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్-ఆయిల్ ఫామ్ పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్ ఫామ్ సాగును ప్రోత్సాహిస్తున్నాయి. డ్రిప్‌కు ఎస్సీ/ఎస్టీ రైతులకు 90శాతం, బీసీ రైతులకు 80శాతం, ఓసీ రైతులకు 70శాతం సబ్సిడీ అవకాశం ఉంది. అదే ఆయిల్ ఫామ్ మొక్కలను అన్ని కేటగిరి రైతులకు 90శాతం సబ్సిడీపై అంటే కేవలం రూ.20 మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది.

## సాగుకు అనుకూల వాతావరణం

ఆయిల్ ఫాం సాగుకు 22 నుండి 33 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత, సంవత్సరానికి 900-1200 మి.మీ. సగటు వర్షపాతం అనుకూలంగా ఉంటుంది. తెలంగాణ రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లాల్లో ఆయిల్ ఫాం సాగుపై మొగ్గు చూపుతున్నారు. అందులో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగామ, యాదాద్రి భువనగిరి, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో అత్యధిక విస్తీర్ణంలో ఆయిల్ ఫాం సాగు చేస్తున్నారు.

## సాగుకు అనుకూల నేలలు

ఆయిల్ ఫాం సాగుకు కనీసం 1.5 మీటర్ల లోతు కలిగిన సారవంతమైన నేలలు అత్యంత అనుకూలమైనవి. మంచి నీటి పారుదల (డ్రైనేజీ) కలిగిన ఎర్ర నేలలు మరియు నల్ల నేలల్లో ఈ పంటను విజయవంతంగా సాగు చేయవచ్చు. అయితే నీరు నిల్వ ఉండే చౌడు నేలలు మరియు లవణ నేలలు ఆయిల్ ఫాం సాగుకు అనుకూలం కావు.

## మొక్కల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ప్రధాన తోటలో నాటేందుకు నర్సరీ నుంచి ఎంపిక చేసే ఆయిల్ ఫాం మొక్కలు ఆరోగ్యంగా, పచ్చగా ఉండి ఎలాంటి తెగుళ్ల లేదా వ్యాధి లక్షణాలు లేకుండా ఉండాలి. మొక్కలు కనీసం 10-12 నెలల వయస్సు, సుమారు 1 మీటరు ఎత్తు, 20-25 సెం.మీ. గర్త్ (మొక్క మొదలు చుట్టుకొలత) మరియు 8-12 ఆరోగ్యకరమైన ఆకులు కలిగి ఉండటం మంచిది. ప్రభుత్వం ధ్రువీకరించిన నర్సరీల ద్వారా రైతులు ఆయిల్ ఫాం మొక్కలను పొందవచ్చు.

## మొక్కలను నాటుకొనుటకు అనుకూల సమయం

ఆయిల్ ఫాం మొక్కలను వర్షాకాలం ప్రారంభమైన తర్వాత 45 నుండి 60 రోజుల వరకు నాటడం అత్యంత అనుకూలం. సాధారణంగా జూన్ మొదటి వారం నుంచి జూలై చివరి వరకు నాటితే మొక్కలకు తగినంత నేల తేమ లభించి, వేళ్ల త్వరగా స్థిరపడి మంచి పెరుగుదల సాధిస్తాయి. అయితే అధిక నీటి వసతి ఉన్న సమయంలో సంవత్సరం పాటు మొక్కలను నాటుకోవచ్చు. ఆయిల్ పామ్ సాగులో త్రిభుజ పద్ధతిలో 9మీ × 9మీ నాటే దూరం పాటిస్తే ఒక ఎకరానికి 57 మొక్కలు, చతురస్రా పద్ధతిలో 9మీ×9మీ నాటే దూరం పాటిస్తే ఒక ఎకరాకు 50 మొక్కలు నాటవచ్చు. అయితే త్రిభుజ పద్దతి ఎక్కువ ప్రాచుర్యం పొందినది.

- ఆయిల్ ఫాం సాగుకు ప్రభుత్వాల ప్రోత్సాహకాలు
- స్థిర ఆదాయంతో రైతు భవిష్యత్‌కు భరోసా
- మార్కెట్ సౌకర్యం..రవాణా ఖర్చులు చెల్లింపు



## నీటి యాజమాన్యం

ఆయిల్ ఫాం నీరు ఎక్కువగా అవసరపడే పంట. కావున రైతులు మొదటి 3 సంవత్సరాల వరకు రోజుకు 40-60 లీటర్లు/మొక్క, 4వ సంవత్సరం నుండి రోజుకు 150-200 లీటర్లు/మొక్క ఇవ్వాల్సి ఉంటుంది. లేని పక్షంలో మొక్క నీటి ఒత్తిడికి గురై మగ పుష్పాలు రావడం ద్వారా దిగుబడిపై ప్రభావం చూపుతుంది.

## ఎరువుల యాజమాన్యం

నత్రజని-భాస్వరం-పోటాష్ ఎరువులను మొదటి సంవత్సరం 200-100-200 గ్రా/మొక్క, రెండవ సంవత్సరం 400-200-400 గ్రా/మొక్క, మూడోవ సంవత్సరం 800-400-1000 గ్రా/మొక్క, 4వ సంవత్సరం నుండి 1300-600-2000 గ్రా/మొక్క/. సేంద్రీయ ఎరువైన పశువుల పేడ ఎకరానికి 5-10 టన్నులు, సూక్ష్మ పోషకాలైన బోరాన్, మాగ్నీషియంను కూడా తప్పకుండా వినియోగించాలి.

## తోట యాజమాన్యం

మొదటి 3 సంవత్సరాల వరకు మొక్క నుండి 1 నుండి 3 మీ. దూరంలో పెసర, మినుము, కంది, వేరుశెనగ, పసుపు, అల్లం మరియు కూరగాయలు వంటి అంతర పంటలు సాగు చేసుకోవడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చు. తరువాత 6వ సంవత్సరం నుండి కోకో(ప్రధాన అంతర పంట), పొద మిరియాలు, తమలపాకు, వక్క, ఎరుపు అల్లం వంటి నిడను ఇష్టపడే అంతరపంటలు సాగు చేసుకోవడం ఉత్తమం.

## దిగుబడి మరియు ఆదాయం

మూడవ సంవత్సరం నుండి ఆయిల్ ఫామ్‌ను పూతకు వదిలిన తరువాత రైతుకు నాల్గవ సంవత్సరం నుండి దిగుబడి ప్రారంభం అవుతుంది. 7వ సంవత్సరం నుండి రైతుకు పూర్తిస్థాయిలో దిగుబడులు రావడం జరుగుతుంది. ఆయిల్ ఫామ్ సాగులో ప్రతినెలా ప్రతి మొక్క నుండి ఒక మట్ట వచ్చి దాని నుండి వచ్చిన పూత ద్వారా ఒక ఆయిల్ ఫామ్ గెల రావడం జరుగుతుంది. ఇలా రైతు సంవత్సరం పొడవునా ప్రతి నెల దిగుబడులు పొందవచ్చు. రైతు ఆయిల్ ఫామ్ గెలలను కోసి నేరుగా సమీప ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీకి తీసుకువెళ్తే ఆయిల్ ఫెడ్ సంస్థ నుండి రైతుకు రవాణా ఖర్చులు ఇవ్వడం జరుగుతుంది లేదా రైతు సమీప మండల ప్రాంతాలలో ఆయిల్ ఫెడ్ సంస్థ వారు ఏర్పాటు చేసిన కలెక్షన్ సెంటర్ల ద్వారా కూడా కొనుగోలు జరుగుతుంది. ఇలా రైతు తీసుకెళ్లిన ఆయిల్ ఫామ్ గెలలకు నెలలో ప్రతి 15 రోజులకొకసారి పేమెంట్ ఇవ్వడం జరుగుతుంది. మంచి యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఎకరాకు సగటున 8-10 టన్నుల తాజా గెలల దిగుబడి రావడం జరుగుతుంది. సగటు ధర టన్నుకు రూ.18వేల నుండి 22వేల వరకు ఉండే అవకాశం ఉంది. ఇలా రైతుకు 1.50లక్షల నుండి 2 లక్షల వరకు స్థూల ఆదాయం లభిస్తుంది. నిర్వహణ ఖర్చులు తీసివేస్తే రైతుకు రూ.ఒక లక్ష నుండి 1.30 లక్షల వరకు నికర ఆదాయం పొందవచ్చు.



ముప్పిడి అశోక్ కుమార్
వ్యవసాయ విస్తరణ అధికారి
ఆత్మకూర్(యం) మండలం
యాదాద్రిభువనగిరి జిల్లా